

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**త్రివిక్రం** మళ్ళీ లాయర్ భాస్కరమూర్తి ఇంటికి ఓ రోజు సాయంత్రం వెళ్ళాడు. గతంలో ఆయన్ని త్రివిక్రం తన తల్లిని బలాత్కరించిన నలుగురి వివరాలు తెలుసుకోడానికి కలిస్తే, ఆయన కొంత సమాచారం ఇచ్చాడు. త్రివిక్రం వెళ్ళేసరికి ఆయన ఓ క్లైంట్ దగ్గర ఉన్నాడు. ముప్పావు గంట వేచి ఉన్నాక ఆయన ఫ్రీ అయ్యాడు. గతంలోలా ఆయన త్రివిక్రంని మేడమీది ఓపెన్ గార్డెన్‌లోకి తీసుకెళ్ళాడు.

"నీ కేసు మీద నేను రాస్తానన్న ఆర్టికల్ పూర్తయింది. వచ్చే వారం లా జర్నల్‌కి పంపుతున్నాను. నీ తండ్రి ఎవరో తెలిసిందా? అదీ కలుపుతాను" ఆయన ఉత్సాహంగా అడిగాడు.

"యస్ అండ్ నో."

"అదేమిటి? కోర్టులో నా ప్రశ్నకి ఎవరైనా ఆ జవాబు చెప్తే ఊరుకోను." నవ్వాడు.

త్రివిక్రం అలెగ్జాండర్, కురంగేశ్వర్, హరినాథ్‌లని కలవడం, వారి డిఎనేలు తన దాంతో మేచ్ కాకపోవడం వివరంగా చెప్పాడు. దాన్ని ఆయన ఆసక్తిగా విన్నాడు.

"నవనీత్ కోసం నేను ఎంత ప్రయత్నించినా ఆయన ఎక్కడ ఉన్నాడో ఇంతదాకా తెలియలేదు. ఆయన్ని కలుసుకోవాలని బలమైన కోరిక ఉంది. ఆయన ఎక్కడ ఉండచ్చో కనుక్కోటానికి మీరేమైనా సలహా కాని, క్లూ గాని ఇస్తారేమోనని మీ దగ్గరకి వచ్చాను సార్." కోరాడు త్రివిక్రం.

"మీరు నేను సూచించిన దానికన్నా విస్తారంగానే అతనికోసం ప్రయత్నించారు. ఎలా కనుక్కోవటం? అతని లాయర్ కూడా జీవించిలేడు" ఆయన కొద్దిసేపు ఆలోచించి చెప్పాడు.

"దినపత్రికలో ప్రకటన ఇవ్వొచ్చు. హిందూ, డెక్కన్ క్రానికల్‌లో ఇచ్చి చూడండి."

"ఏమని?"

ఆయన కాగితం, కలం తెప్పించి తనే ఇంగ్లీషులో రాసిచ్చాడు.

'1980లో ప్రమీల అనే ఆమె రేప్ కేసులో శిక్ష పడ్డ నవనీత్ కాని, ఆయన పరిచయం ఉన్నవారు కాని ఈ క్రింది ఫోన్ నెంబర్‌కి కాంటాక్ట్ చేయగలరా? మొదటగా కాంటాక్ట్ చేసిన ఐదు మందికి తలో వెయ్యిన్నూట పదహార్లు బహుమతిగా ఇవ్వబడుతుంది. కేవలం వ్యక్తి గత కారణంగానే ఆయన వివరాలు కోరబడుతున్నాయి తప్ప చట్టపరమైన కారణం కాదని మనవి.'

"బావుంది" దాన్ని చదివి తృప్తిగా చెప్పాడు త్రివిక్రం.

"గాల్లోకి రాయి విసిరినట్లే. వెళ్ళి అద్దానికి తగులుతుందో లేదో చూద్దాం. దీన్ని ఎడ్వర్‌టైజింగ్ ఏజన్సీ ద్వారా పంపమని కింద మా జూనియర్‌కి ఇస్తే అతను ఆ పని చూస్తాడు. మేం లీగల్ నోటీస్‌లని ప్రకటనలకి తరచు ఆ ఏజన్సీ ద్వారానే పంపుతూంటాం."

"థాంక్స్ అగైన్ సర్."

ఆయన త్రివిక్రంకి మళ్ళీ డాబా మీద సేద్యం చేసే మొక్కల నించి నేతి బీరకాయలు, టమోటాలు కోసి ఇచ్చాడు.

"ఎందుకు సార్? మీ ఇంట్లో వాళ్ళే వీటిని వండుకోవచ్చుగా?" మొహమాటంగా చెప్పాడు త్రివిక్రం.

"శాక దానం చేస్తే శోకం ఉండదని సామెత. మాకు అవసరం తీరగా ఇంకా ఎవరికైనా ఇవ్వటానికి సరిపడా పండిస్తున్నాను. ఈ తోట పని నాకు హాబీ. నా ఆరోగ్యానికి ఈ తోటే కారణం. తాజా కూరలకి తాజా కూరలు, ఎక్సర్ సైజుకి ఎక్సర్ సైజు. రోజూ ఉదయం ఓ అరగంట ఇక్కడ పనిచేస్తూంటాను" జవాబు చెప్పాడు భాస్కరమూర్తి.

ఆయన జూనియర్ ఆ ప్రకటనని చదివి ఎంతవుతుందో చెప్తే త్రివిక్రం అతనికి ఆ డబ్బు చెల్లించాడు. అతను వెంటనే ఏజన్సీకి ఫోన్‌లో ఆ ప్రకటనని డిక్టేట్ చేసి త్రివిక్రంతో చెప్పాడు.

"ఈ ఆదివారం హిందూలో, క్రానికల్‌లో ప్రకటనలు వస్తాయి."

## 17

శనివారం సాయంత్రం స్ఫూర్తిని త్రివిక్రం ముందు అనుకున్న సమయానికి మేక్‌డొనాల్డ్స్‌లో కలుసుకున్నాడు. జీన్స్ పేంట్, టాప్‌లలో ఉన్న స్ఫూర్తి ఈసారి కూడా తన తండ్రికి వినిపించడానికి తమ సంభాషణని రహస్యంగా సెల్ ఫోన్‌లో రికార్డు చేసింది.

ఇద్దరూ వెజ్ మేక్ పిజ్జాలని, పొటాటో వెడ్జెస్‌ని, ఫ్రెంచ్ ఫ్రైస్‌ని, కోక్‌ని తీసుకున్నారు. నాలుగైదు నిమిషాలు వేచి ఉంటే కాని సీట్ దొరకలేదు.

"ఇంక మీరు నన్ను కాంటాక్ట్ చేస్తారని నేను అనుకోలేదు" మేక్ పిజ్జాని దాని పెట్టెలోంచి బయటకి తీస్తూ చెప్పాడు త్రివిక్రం.

"ఆగండి. కాలుతుంది" స్ఫూర్తి హెచ్చరించే లోగానే కొరికాడు.

"కాలింది" చెప్పాడు బయటకి గాలిని ఊదుతూ.

"మీరు గమనిస్తే ఆ అట్టపెట్టె మీద 'కాషన్ హాట్' అనే హెచ్చరిక కూడా ఉంది. పెళ్ళికి సంబంధించి కొంత రీసెర్చ్ చేసాక కలుద్దామని ఆగాను" తన తండ్రికి చెప్పిందే చెప్పింది.

"అది నిజం. కాంప్రమైజ్ తప్పదని నాకు కూడా మూడు వారాల్లో తెలిసింది. మనం కలిసాక నేను మేరేజ్ డాట్ కాంలో నా ప్రొఫైల్‌ని పెట్టాను. నేను కోరుకునే క్వాలిఫికేషన్స్ అన్నీ ఉన్నవారు ఒకరిద్దరు దొరికారు. కానీ నేను మెన్షన్ చేయని, నాకు నచ్చని కొన్ని వారిలో ఉన్నాయి."

"ఐతే అది మీరు మరోసారి నాకు కన్‌ఫం చేసారు. ఎన్ని పెళ్ళిచూపులు అయ్యాయి?" నవ్వుతూ అడిగింది స్ఫూర్తి.

"అప్పుడేనా? రేపే నా మొదటి అనుభవం. వెస్ట్ మారేడ్‌పల్లిలో డాక్టర్ సుభాషిణితో రేపు సాయంత్రం పెళ్ళిచూపులు."

"దట్స్ గుడ్"

"రోజూ నిద్రలేచాక, పడుకోబోయే ముందు ఆ సైట్‌లోకి వెళ్ళి ఎంక్వైరీలు ఏమైనా ఉన్నాయా? అని చూసుకోవడంలో నాకు కొంత థ్రిల్ ఉంటోంది. కాకపోతే జాగ్రత్తగా వారి పూర్వాపరాలు విచారించి చేసుకోవాలి. ఇందులో మోసాలు కూడా ఉంటాయని మిత్రులు హెచ్చరించారు."

"పూర్వపు పెళ్ళిళ్ళ పేరయ్యలు ఏం అయ్యారో కాని వాళ్ళే బెటర్. పూర్వాపరాలు తెలుసుకుని వ్యక్తిగత పూచీకత్తు మీద వాళ్ళు సంబంధాలు వెదికేవారని మా పెద్దమ్మ చెప్తూంటుంది. ఆవిడ మనవల, మనవరాళ్ళ పెళ్ళిళ్ళన్నీ కూడా డాట్ కాం ద్వారానే కుదిరాయి. లక్కీగా అంతా హేపీగానే ఉన్నారు."

"మీ నాన్నగారితో చర్చించాలని క్రితంసారి మీరు చెప్పిన గుర్తు. ఆ చర్చ జరిగిందా?" అడిగాడు త్రివిక్రం.

"జరిగింది. నా నిర్ణయానికే వదిలేసారు."

"దటీజ్ గ్రేట్! నాలో కొన్ని అభ్యంతరాలు ఆయనకి తోచి ఉండాలే? ముఖ్యంగా వయసు."

"అదొక్కటే తనకి అభ్యంతరమని చెప్పారు."

"అనుకున్నాను. కానీ ఇంత ముఖ్య విషయాన్ని కూడా మీ నాన్నగారు మీకు వదిలేసారా? ఆశ్చర్యం.

స్ఫూర్తి కొద్దిసేపు మౌనంగా ఉండి తర్వాత చెప్పింది.

"మా అమ్మపోయిన కొద్దిరోజులకి డిసెంబర్ థర్టీ ఫస్ట్ వచ్చింది. ఆ రాత్రి మా నాన్న మా అందరికీ తలో కవరు ఇచ్చారు. ఆ గ్రీటింగ్ కార్డ్‌లో ఇలా రాసారు.

'ఈ ఏడాది నేను మీకు ఇచ్చే బహుమతి మూడు వందల అరవై ఐదు గంటలు. ప్రతీ రాత్రి భోజనానంతరం మీకు నా సమయంలోని ఓ గంట ఇస్తాను.' ఆయన తన మాటని నిలబెట్టుకోవడమే కాకుండా ప్రతీ ఏడు దాన్ని రెన్యూ చేస్తున్నారు. అది మా అందరికీ లభించిన గొప్ప బహుమతి. మా తప్పుల నించి మేము పాఠాలు నేర్చుకునే అవకాశాలుగా ఆ సమయాన్ని ఆయన వినియోగించేవారు. ఆ సమయంలో మా నాన్న మాకు రీజనింగ్‌ని, స్వతంత్రంగా ఆలోచించగలగడాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నేర్పుతూ వస్తున్నారు. కాబట్టి మా నిర్ణయాల మీద మా నాన్నగారికి నమ్మకం ఉంది. ఒకోసారి నిశ్శబ్దంగా బయట కురిసే వాన చప్పుడుని కలిసి వినేవారం. ఒకోసారి మా సమస్యల గురించి ఓపెన్‌గా చర్చించేవారం."

అది విన్న త్రివిక్రంకి స్ఫూర్తి తండ్రి వ్యక్తిత్వం మీద గౌరవం కలిగింది.

ఇంటర్‌నెట్‌లో వయసులో ఇంత తేడా ఉన్న వారిని పెళ్ళి చేసుకోవటం మీద కొంత సెర్చ్ చేసి చాలామంది అనుభవాలు చదివాను. అవన్నీ మిక్స్‌డ్‌గా ఉన్నాయి. ఒకరెవరో రాసారు, విజయవంతం అయిన పెళ్ళనేది ఛాన్స్ తప్ప, ఎంపిక వల్ల జరగదని, ఆమెని సపోర్ట్ చేయకూడదని త్రివిక్రం మాట్లాడలేదు.

"ఎనీ వేస్, లెట్స్ గెట్ మేరెడ్" చెప్పింది.

"వాట్"

"వాట్ ఏమిటి? మీరు పోయినసారి నాకు ఇలాగే షాకింగ్‌గా ప్రపోజ్ చేసారు. నేను ఈసారి నా ఫైనల్ డెసిషన్‌ని చెప్పాను."

"ఇంత త్వరగా, ఇంత తేలికగా ఎస్ చెప్తారని నేను అనుకోలేదు. మీ నాన్నగారితో ముందు నన్ను మాట్లాడించి."

"అవన్నీ ఎటూ జరుగుతాయి. అది నాన్నగారి జాబ్. నా జాబ్ మిమ్మల్ని పెళ్ళిచేసుకోవడం" నవ్వింది.

"థాంక్స్. ఐ యామ్ హేపి."

"అయితే మీరు మా నాన్నగారిని ఒకసారి కలుస్తారా?"

"తప్పకుండా. అది నా బాధ్యత కూడా. ఆయన్ని ఎప్పుడు కలుసుకోవాలని చెప్తే.."

ఆ తరువాత వాళ్ళు ముప్పావుగంట పైగా మాట్లాడుకున్నారు. పెళ్ళి ఎలా జరగాలీ, ఎక్కడ జరగాలీ, హనీమూన్‌కి ఎక్కడికి వెళ్ళాలి నించి, తమ అభిరుచుల్లో తేడా వస్తే ఎలా అడ్జస్ట్ అవ్వాలిలాంటి సీరియస్ విషయాలు కూడా వాళ్ళ మాటల్లో చోటు చేసుకున్నాయి.

ఎప్పటిలా స్ఫూర్తిని లకడీకా పూల్‌లోని బస్టాప్‌లో డ్రాప్ చేసి ఇంటికి వెళ్ళిపోయాడు త్రివిక్రం. సుందరేశన్‌కి జరిగింది చెప్పాడు.

"మీ అమ్మ ఉంటే ఆవిడతో ఇలాంటివి మాట్లాడితే ఆవిడ ఎంత సంబరపడేదో" చెప్పాడు సుందరేశన్.

చిన్నగా నిట్టూర్చి చెప్పాడు త్రివిక్రం.

"మీరు బయటివారిలా కాక, మా ఇంట్లోని వ్యక్తిలా మాట్లాడారు. మా పెళ్ళయ్యాక కూడా మీరు మా దగ్గరే ఉంటారు. మా నాన్నగారికో కోడలు వచ్చిందని మిమ్మల్ని వెళ్ళమనను."

"థాంక్స్. కానీ ఆ అమ్మాయికి నేను మీ మధ్య ఉండటం ఇష్టం లేకపోవచ్చు" నవ్వాడు సుందరేశన్.

"నేను మాట్లాడిన వాటిలో ఈ ప్రసక్తి కూడా ఉంది. మీరు మాతో ఉండటానికి తనకేం ఇబ్బంది లేదంది స్ఫూర్తి."

"ఐ యామ్ గ్లాడ్" చెప్పాడు సుందరేశన్.

త్రివిక్రం నవనీత్ కోసం ఇచ్చిన ప్రకటన రెండు దినపత్రికల్లో వచ్చింది. దానికి రెస్పాన్స్‌గా మొదటి ఫోన్ ఆ ఆదివారం ఉదయం ఏడుకే వచ్చింది.

ఆదివారం ఉదయం ఏడుగంటలకి సెల్ ఫోన్ మోగితే దాన్ని త్రివిక్రం ఆన్సర్ చేసాడు.

"ఇవాళ మీ ప్రకటనని హిందూలో చూసాను. ఆ కేసులోని అలెగ్జాండర్ వివరాలు మీకు చెప్పగలను. ఆయన మా పెదనాన్న. ఆయనద్వారా మీరు నవనీత్ వివరాలు కనుక్కోవచ్చు. లేదా నేనే అలెగ్జాండర్‌ని సంప్రదించి"

"అలెగ్జాండర్‌ని ఇదివరకే నేను కలిసాను. ఆ కేసులోని మరో ఇద్దరు ముద్దాయిల్ని కూడా కలిసాను. వాళ్ళకి నవనీత్ గురించి తెలీదు. నాక్కావల్సిందల్లా నవనీత్ ఫోను నెంబర్, లేదా చిరునామా."

"అయితే సరే." అవతల నించి లైన్ కట్ చేసారు.

ఆ తరువాత డజనుకి పైగా కాల్స్ త్రివిక్రంకి ఆ ప్రకటన చదివిన వారి నించి వచ్చాయి. ఒకరు తమ కొడుక్కి మంచి రేంక్ వచ్చిందని, ఇంజనీరింగ్‌లో చేర్పించటానికి ఆర్థిక సహాయం చేస్తారా అని అడిగారు. మరొకరు తను హెచ్.ఏ.ఎల్‌లో పని చేసి రిటైరయిన ఇంజనీర్‌నని, తను వికలాంగుడినని, తన పెన్షన్ తన అవసరానికి బొటాబొటీ సరిపోతుందని, తన పిల్లలు వృద్ధాప్యంలో తనని సరిగా చూడటంలేదని, తనకి పుస్తకాలు చదవటం హాబీ అని, బుక్స్ కొనుక్కోవటానికి కొంత డబ్బు పంపగలరా అని అడిగాడు. త్రివిక్రం వారిద్దరి చిరునామాలు తీసుకుని చెక్‌లని పోస్టు చేస్తానని చెప్పాడు.

నవనీత్ ఎక్కడ ఉన్నాడో సూచించే వివరాలు ఫోన్ చేసిన ఎవరూ స్పష్టంగా చెప్పలేకపోయారు. ఒకరిద్దరు ఆ కేసు గురించి తెలుసుకోవాలనే ఆసక్తితో ఫోన్ చేసారు. నవనీత్ హైదరాబాద్‌ని చాలా ఏళ్ళ క్రితమే వదిలేసి ఉంటాడని, అందుకనే ఎవ్వరికీ అతని గురించి తెలీదని త్రివిక్రంకి అనిపించింది.

ఎనిమిది గంటలకి త్రివిక్రం సెల్ మోగింది. ఓ మగ కంఠం అడిగింది.

"డాక్టర్ త్రివిక్రం గారితో మాట్లాడాలి."

"నేనే. మీరు?"

"నా పేరు బలదేవుడు. స్ఫూర్తి ఫాదర్‌ని. మా అమ్మాయి నిన్న రాత్రి నాతో మీ గురించి మాట్లాడింది. నేను మీ ఇంటికి వచ్చి మీతో మాట్లాడటం విధాయకం. ఎప్పుడు రమ్మంటారు?" అడిగాడు.

"ఇవాళ సాయంత్రం ఎప్పుడు వచ్చినా సరే. నేను ఇంట్లో ఉంటాను."

"కాని ఆ సమయంలో మీ ఇంకో అపాయిట్ మెంట్ ఉందని స్ఫూర్తి చెప్పింది?"

ఆ రోజు తన పెళ్ళిచూపుల గురించి కూడా స్ఫూర్తి తన తండ్రికి చెప్పిందని గ్రహించాడు త్రివిక్రం.

"వాళ్ళకి ఫోన్ చేసి నేను పెళ్ళిచూపులకి రావటంలేదని, అనుకోకుండా నాకు ఇంకో మేచ్ సెటిలయ్యిందని ఆల్‌రెడీ చెప్పేసాను."

"సరే. నేను, మా అన్నయ్య కలిసి వస్తాం."

అడ్రస్ ఇచ్చి తన ఇంటికి ఎలా రావాలో త్రివిక్రం ఆయనకి దారి చెప్పాడు. తన పిన్నికి కూడా ఆ విషయం ఫోన్ చేసి చెప్పాడు.

ఆవిడ రెండు విషయాలకి ఆశ్చర్యపోయింది.

"ఇంటర్‌నెట్ ఛాట్‌లో పరిచయం ఇంత దూరానికి వచ్చిందా? నీకన్నా దాదపు పదేళ్ళ చిన్నదైనా నిన్ను చేసుకోవడానికి ఒప్పుకుందా?"

త్రివిక్రం పినతండ్రి అతన్ని అభినందించాక చెప్పాడు.

"ఈ రోజుల్లో ఎవరూ పెద్దగ కట్నానికి ఆశపడటంలేదు. పిల్లకి నగలు, పెళ్ళి ఘనంగా చేయటం గురించి మాట్లాడు. మాటలకి పెద్దవాళ్ళు మేం నీ పక్కన ఉంటే హుందాగ ఉండేది. కానీ మేం ఇప్పుడు బయలుదేరినా టైంకి రాలేం"

"మీరు వస్తారేమోనని ఫోన్ చేస్తున్నాను. రండి."

"ఏం అనుకోకు. కుదరదు."

పిన్ని జానకి మళ్ళీ ఫోన్ అందుకుని చెప్పింది.

"మా వారి మాటలు పట్టించుకోకు. ఆయనకి లోకం తీరు తెలీదు. ఆడపడుచు లాంఛనాలు అంటూ ఇస్తారు. మా అమ్మాయిలిద్దరికీ చెరో బంగారు గుళ్ళ నెక్లెస్‌ని కొనమను. ఒక్కోటి నలభై, యాభై వేలల్లో వస్తాయి. లోపల లక్కపెట్టి చేస్తున్నారు. ఇవాళ అదే ఫ్యాషన్. నాకో పట్టుచీర. ఖరీదు కనీసం ఇరవైవేలుండాలని చెప్పు. ఇంతకీ ఆయనేం చేస్తున్నారు?"

"బి.హెచ్.ఈ.ఎల్‌లో ఏదో ఉద్యోగం అట. అడగలేదు."

"పోన్లే. చిన్న ఉద్యోగస్తుడైతే మాత్రం బాధించొద్దు. పెట్టగలిగే సమర్థత ఉంటే మాత్రం తీసుకోవడంలో తప్పులేదు."

"నేను కట్నాలకి వ్యతిరేకం పిన్నీ" నవ్వాడు.

మరి కాసేపు మాట్లాడాక ఫోన్ పెట్టేసాడు త్రివిక్రం.

తర్వాత తన బాబాయ్‌లు సోమశేఖర్, ఆదిశంకర్‌లతో కూడా ఆ విషయం ఫోన్ చేసి చెప్పాడు.

## 18

స్ఫూర్తి తండ్రి బలదేవుడు రావడానికి అరగంట ముందు శ్యామలరావు వచ్చాడు.

"సార్. నవనీత్ గారి గురించి తెలిసింది. ఆయన తండ్రిపోయాక వ్యాపారాన్ని ఆపేసి పూనాకి వెళ్ళిపోయారు. ఓ మహారాష్ట్రియన్‌ని చేసుకున్నారు. శాంతి నగర్‌లోని ఓ ఫర్నిచర్ షాపు యజమాని కూతురు ఆమె. ప్రేమ వివాహం. ఆ ఇంటిని, షాపుని ఆయన అత్తమామలు పోయాక సోదరులు అమ్మేసారు. సోదరులు ఇద్దరూ మహారాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డ్‌లో పనిచేసి రిటైరయ్యారు. పూనాలోని నవనీత్ అడ్రస్‌ని ఎవరూ చెప్పలేకపోయారు."

"ఎలా తెలిసిందది?" త్రివిక్రం ఉత్సాహంగా అడిగాడు.

"హైదరాబాద్ స్మాల్ బిజినెస్ మెన్ అసోసియేషన్ ఒకర్ని నవనీత్ గురించి అడిగితే, అతను రికార్డులన్నీ వెదికాడు. నవనీత్ ఉద్యోగం చేయడని, మళ్ళీ ఏదో చిన్న వ్యాపారమే పెడతాడని నేను నమ్మి ఆ అసోసియేషన్‌కి వెళ్ళాను. అక్కడున్న క్లర్క్ మా మార్గదర్శికి క్లైంట్ కాబట్టి, శ్రద్ధగా నేను కోరిన సమాచారాన్ని వారం పాటు వెదికి మొత్తానికి పట్టుకున్నాడు."

"మీరు పూనా వెళ్ళి..."

"తప్పకుండా. పూనా టెలిఫోన్ డైరక్టరీలోని ఆ పేరుగల వాళ్ళ ఫోను నెంబర్లని ఇప్పటికే సంపాదించాను."

పూనాలో తన ప్లాన్ ఆఫ్ ఏక్షన్‌ని శ్యామలరావు వివరించాడు. తన పెళ్ళికి నవనీత్ కూడా హాజరవచ్చని త్రివిక్రంకి ఆశ కలిగింది.

***(ముగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in